

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. దశల వారీగా ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహించనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించేది లేదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన 52 పరీక్షా కేంద్రాలను ఆర్ఐఓ నర్సింహులు గురువారం సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 41,304 మంది పరీక్షకు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 21,288 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,016 మంది హాజరు కానున్నారు. ఈ ఏడాది ఇసి కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించనున్నారు.

కోడ్ కూయకనే ప్రచారం

- జోరుగా వైసిపి, టిడిపి అభ్యర్థుల ప్రచారం
- అభ్యర్థుల ఖరారుతో పెరిగిన వేగం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



ఎన్నికల ప్రకటనకు ముందే రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో ప్రచార జోరు ఊపందుకుంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార వైసిపి, విపక్ష టిడిపి, జనసేన కూటమి రాష్ట్ర స్థాయిలో సభలు నిర్వహిస్తున్న విషయం విదితమే. వైసిపి అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేయగా టిడిపి, జనసేన కూటమి ఇటీవల మొదటి జాబితా విడుదల చేసింది. త్వరలో రెండో జాబితా విడుదలకు సిద్ధమవుతుంది. మరోవైపు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఓటర్ల జాబితాపై ఇటీవల కసరత్తు పూర్తి చేసిన తుది జాబితా విడుదల చేసింది. ఎన్నికల ప్రకటన విడుదల చేయడమే తరువాయి. సాధారణంగా ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రకటన అనంతరం అభ్యర్థులు ఓట్ల అభ్యర్థించటం ఆనవాయితీ. అయితే ప్రస్తుత పరిస్థితులు పూర్తిగా తలకిందులయ్యాయి. అధికార వైసిపి, విపక్ష టిడిపి, జనసేన కూటమి అభ్యర్థులను ఖరారు చేయకుండానే ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇరు పార్టీల అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అధికార బలంతో వైసిపి అభ్యర్థి ఎంపీ భరత్‌రామ్ రహదారులపై భారీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఒక ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ఎల్ఇడి స్క్రీన్‌ల ద్వారా నగర అభివృద్ధి తనతోనే సాధ్యమైందంటూ నగర వీధుల్లో ప్రచారం చేస్తున్నారు. అయితే పూర్తి కాని మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్‌ను సైతం ప్రచారం చేయటంతో ప్రజలు విస్తుపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ నిధులతో అభివృద్ధి చేసిన కంబాల చెరువు, రహదారుల మధ్య డివైడర్ల ఏర్పాటు, గ్రీనరీ తదితర కార్యక్రమాలను తన ఖాతాలో వేసుకోవటం విమర్శలకు దారి తీస్తోంది. ప్రతిపక్ష టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు సైతం ప్రచార జోరు పెంచారు. కొన్ని నెలలుగా మొబైల్ అన్న కాంటీన్లు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఎన్నికల ప్రకటనకు ముందే ప్రచారం హోరెత్తుతోంది. ఇరు పార్టీల అభ్యర్థులు అభివృద్ధి జపం చేయడం చర్చనీయాంశంగా మారింది. 2004, 2009,2014 వరుసగా మూడుసార్లు మున్సిపల్ కార్పొరేషన్‌లో టిడిపి మేయర్లు అధికారంలో ఉన్నారు. రాజమండ్రి సిటీ నియోజకవర్గంలోనూ తెలుగుదేశం జెండా ఎగురవేశారు. ప్రజల అవసరాలకు తగ్గట్టు అభివృద్ధి జరగలేదనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. అయితే టిడిపికి క్షేత్రస్థాయిలో కార్యకర్తల బలం ఉండటంతో 2014, 2019లో రెండుసార్లు వైసిపికి పరాజయం తప్పలేదు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి విజయం సాధించినప్పటికీ ఓటమి భయంతోనే రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించలేదనే విమర్శలు ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా భరత్ రామ్ గెలిచిన అనంతరం తొలి ఏడాది నుంచే రాజమహేంద్రవరం అసెంబ్లీ స్థానంపై కన్నేశారు. ప్రత్యేక అధికారి పాలన కావటంతో అభివృద్ధి పేరుతో రూ.కోట్లు వెచ్చించారు. నగర ప్రజలకు కావల్సిన మౌలిక వసతులపై దృష్టి సారించలేదు. గతంలో ఏర్పాటైన పార్కులు, రోడ్లకు మెరుగులు దిద్ది అదే అభివృద్ధి అంటూ ప్రచారం ప్రారంభించారు. గోదావరి చెంతన ఉన్నప్పటికీ తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దశాబ్దాల క్రితం వేసిన సైడ్ కాల్వలు ఆధునీకరణకు నోచుకోకపోవటంతో చిన్నపాటి వర్షాలకే నగరం ముంపు బారిన పడటంతో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ప్రజా తీర్పుతో ఇరు పార్టీల అభ్యర్థుల భవితవ్యం త్వరలోనే తేలనుంది.



కేక్ కట్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

గాడిచర్లకు ఘన నివాళి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావుకు సీనియర్ సిటిజన్లు ఘనంగా నివాళి అర్పించారు. గాడిచర్ల వర్ధంతిని గురువారం సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్యాపురం డాక్టర్ ఎవి.నాగేశ్వరరావు పార్కులో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ భవనంలో అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిచ్చుక వెంకటరాజు, బొమ్మయోజుల వెంకట శ్రీరామ్మూర్తి, కె.సంజీవరావు, గంతకూర అప్పారావు మాట్లాడారు. సర్వోత్తమరావు సేవలను వివరించారు. అనంతరం ఈ నెలలో వివిధ తేదీల్లో జన్మించిన 15 మంది సభ్యుల పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. వారితో కేక్ కట్ చేయించి స్వీట్ పాకెట్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. 60 మంది సీనియర్ సిటిజన్స్ సభ్యులు పాల్గొన్నారు.

'వాసవి' ఆధ్వర్యాన బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

వాసవి క్లబ్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం బియ్యం పంపిణీ చేశారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నాలుగు సంవత్సరాలకు వచ్చే లీప్ సంవత్సరం ఫిబ్రవరి 29న వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. సత్యవతి నగర్‌లో ఉన్న రక్షక గణపతి మందిరానికి అన్నదానం నిమిత్తం 26 కేజీలు, మదర్ థెరిసా అనాథాశ్రమానికి 26 కేజీలు, వాత్సల్య వృద్ధాశ్రమానికి 26 కేజీలు, టోల్‌గేట్ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం నిమిత్తం 26 కేజీలు, సంస్కృత పాఠశాల శివాలయంలో 26 కేజీలు, రావణ బ్రహ్మ శివాలయంలో 26 కేజీలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మద్దుల సత్యనారాయణ, పలుకూరి రామారావు, రాఘవ, రమాకాంత్, సత్యవరపు గురునాథ్, కొత్త సురేష్ కుమార్, పెరుమాళ్ల వీరేశ్వరరావు, నాగుబండి గంగరాజు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం : కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

మన దేశంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజల చేతిలో వజ్రాయుధమని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత పేర్కొన్నారు. గురువారం రాజమండ్రి రూరల్‌లోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గం ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ రోజున తప్పకుండా ఓటు వెయ్యాలని కోరారు. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే ప్రభుత్వాధికారులు, సిబ్బంది ఉదయమే ఓటు వేసి విధులకు హాజరవుతారని చెప్పారు. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ బాధ్యత నిర్వర్తించాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 73.81 శాతం ఓటింగ్ నమోదైతే కొన్ని కేంద్రాలలో 32 నుంచి 50లోగా, కొన్ని పిఎస్‌లలో 50 నుంచి 55 శాతం వరకే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు గుర్తించామన్నారు. బిఎల్ఒలతో మాట్లాడుతూ, నియోజకవర్గ సగటు కంటే తక్కువ పోలింగ్ జరిగిన పిఎస్‌ల వారీగా వివరాలు అందుబాటులో ఉంచామని, ఆయా ఓటరు జాబితా అనుసరించి గతంలో ఓటు వెయ్యని వారి వద్దకు వెళ్లి చైతన్యం తీసుకుని రావాలని తెలిపారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం ద్వారా ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా తక్కువ ఓటు నమోదు చేసిన పిఎస్‌లను గుర్తించి, అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అక్కడ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను ఆర్ఒ ఆధ్వర్యాన చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లతో సంభాషించిన కలక్టర్ రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ఇన్నీసుపేట, ఆల్కట్ గార్డెన్స్, సాయి కృష్ణ థియేటర్ ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. కలెక్టర్ వెంట తహశీల్దారు వైకెవి.అప్పారావు, డిటి ఎంకె సుధీర్ పాల్గొన్నారు.

నగరానికి ఆణిముత్యంగా చిత్రాంగి ప్యాలెస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరానికి మరో ఆణి ముత్యంగా చిత్రాంగి ప్యాలెస్ రాబోతోందని రాజమండ్రి ఎంపీ, వైసి సిటీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. స్థానిక పుష్కర్ ఘాట్ సమీపంలోని చారిత్రక కట్టడం చిత్రాంగి ప్యాలెస్‌ను ఆనుకుని ఖాళీగా ఉన్న సుమారు రెండెకరాల ఖాళీ స్థలంలో అద్భుతమైన 'చిత్రాంగి ప్లాజా' పేరుతో తీర్చిదిద్దనున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని ఇలాగే వదిలేస్తే సంఘ విద్రోహ శక్తులు పెట్రేగిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన ఎంపీ రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సంప్రదించారు. ఇప్పుడు ఆ స్థలంలోనే అందమైన, అద్భుతమైన చిత్రాంగ ప్లాజా నిర్మిస్తున్నారన్నారు. ఎంపీ ల్యాడ్స్ రూ.1.8 కోట్లతో ఈ ప్లాజా రూపు దిద్దుకోబోతోందన్నారు. ఇది నగరంలోనే అద్భుతమైన స్థలంగా, అన్ని వర్గాలకు ఆహ్లాదకరమైన ప్రాంతంగా మార్చబోతున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి ఈ చిత్రాంగి ప్లాజాను నగర వాసులకు అంకితం ఇవ్వబోతున్నట్టు తెలిపారు. ఒకవైపు గోదావరి, మరోవైపు వంతెనలతో చూడ చక్కని దశ్యాల నడుమ ఈ చిత్రాంగి ప్లాజా మరింత ఆకర్షణీయంగా కనబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, అజ్జరపు వాసు, ఛాంబర్ ప్రెసిడెంట్ జవర్, పోలు విజయలక్ష్మి, సంకిస భవానీ ప్రియ, ఎన్‌వి.శ్రీనివాస్, ఆర్ఎంసి ఎస్ఇ పాండు రంగారావు, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

పాక తొలగించారని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -గోకవరం

ప్రభుత్వ మిగులు స్థలంలో వేసుకున్న పాక తొలగించారని రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన పిల్లి రామకృష్ణ తన శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గతంలో రంపఎర్రంపాలెం గ్రామంలో ఎస్‌సి కాలనీకి ఆనుకొని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. కేటాయించిన లేఔట్‌లో కొంత స్థలం మిగలడంతో ఆ మిగిలిన భూమిలో ఇటీవల కొంతమంది ఇళ్ల స్థలాలు లేని వారు పాకలు వేసుకుని నివసిస్తున్నారు. ఆ మిగులు భూమిలోనే రామకృష్ణ, దుర్గాదేవి దంపతులు రూ.10 వేలతో పాక వేసుకున్నారు. గురువారం రెవెన్యూ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది పాకలు తొలగించే ప్రయత్నం చేస్తుండగా రామకృష్ణ తనపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఇద్దరు పిల్లలతో ఉన్న తమకు న్యాయం చేయాలని ఆ దంపతులు కోరారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి

ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-గోపాలపురం



ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత

రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికీ, అభివద్ధికీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హోమ్ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని సంజీవపురం, దొండపూడి, సగ్గొండ పంచాయతీల పరిధిలో నిర్మించిన సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బికె భవనాలను హోమ్ మంత్రి తానేటి వనిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే పాలనను అందిస్తోందన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ గ్రామ సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమది ప్రజల ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. అవినీతికి కానీ వివక్షకు కానీ తావు ఇవ్వకూడదన్నదే తమ లక్ష్యమని చెప్పారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కరించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. సంజీవపురంలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె, రేగులకుంటలో వైఎస్సార్ హెల్త్ సెంటర్, దొండపూడిలో ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్, సగ్గొండలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె కేంద్రాలను ప్రారంభించినటుట తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జెడ్‌పిటిసి కె.లలిత, సర్పంచులు యండపల్లి శేఖర్‌బాబు, మల్లిపూడి అచ్చిబాబు, ఇళ్ల శ్రీరామ్మూర్తి, కురుకూరి ధనలక్ష్మి, పైడి శిరీష, అన్వర్ బాషా, మేక సతీష్ బాబు, యండపల్లి కవిత, భూమ్మీద నాగరాజు పాల్గొన్నారు.



ఎంఇఒను సత్కరిస్తున్న మంత్రి వేణు తదితరులు

ఎంఇఒ లజపతిరాయ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

15 ఏళ్లుగా ఎంఇఒ వి.లజపతిరాయ్ అందించిన సేవలు ఎంతో అభినందనీయం అని జిల్లా ఇన్చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన ఎంఇఒ లజపతిరాయ్ ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంఇఒ లజపతిరాయ్‌ను పూల కిరీటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరో అతిథిగా పాల్గొన్న రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి ఎంఇఒను ఘనంగా సత్కరించారు. ఎంఇఒల సంఘం ఆధ్వర్యంలోనూ లజపతిరాయ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎంఎల్‌సి కందుల దుర్గేష్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, తాడాల చక్రవర్తి, సర్పంచ్‌లు అన్నదేవుల చంటి, వై.స్టాలిన్, ఎంపిడిఒ రాజ్ మనోజ్, సిఐ తులసీధర్, ఎంఇఒ ఏడిద నాగేశ్వరరావు, దాసరి శేషగిరి పాల్గొన్నారు.

వైసిపి పాలనకు మంగళం : ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రానున్న ఎన్నికల్లో వైసిపి పాలనకు మంగళం పాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని టిడిపి రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. స్థానిక 48వ డివిజన్‌లో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు ఆధ్వర్యారన టిడిపి డివిజన్ నాయకులు కానేటి ప్రభుదాసు, కానేటి కృపామణి, కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మేజర్ సమస్యలను టిడిపి, జనసేన పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టో కరపత్రాలు, జగన్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన ఐదేళ్లుగా మనమంతా పడుతున్న వెతలు తీరాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులకు ఓట్లు వేసి ఆ కూటమిని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ప్రభుత్వం ఐదేళ్లుగా ప్రజలపై మోపిన అధిక భారాలను తగ్గిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ - జనసేన పార్టీ రాష్ట్ర, రాజమండ్రి పార్లమెంట్, నగర కమిటీల నాయకులు, వివిధ విభాగాల కమిటీల నాయకులు, అధిక సంఖ్యలో యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై శిక్షణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్



శిక్షణలో పాల్గొన్న జెసి తేజ్ భరత్

స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసిసి బృందాలు, ఎఇఆర్ఒలు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు, ముఖ్య సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల నియమావళిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెసి తేజ్ భరత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకూ తావులేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తి పారదర్శకంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ క్రమంలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే ఎన్నికల ఖర్చుల నియంత్రణ పరిశీలకుల బృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. డబ్బు వినియోగంపై దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికల్లో మితిమీరిన, అక్రమ ఖర్చులే అవినీతికి మూలకారణని పేర్కొన్నారు. నగదును తీసుకెళ్లడం చట్టం ప్రకారం చట్టవిరుద్ధం కాదు కానీ భారీ నగదు లావాదేవీలు అనుమానాన్ని సృష్టిస్తాయన్నారు. ఎన్నికల సమయంలో భౌతికంగా, ఎటువంటి నగదు లావాదేవీలూ వాటి విషయంలో సహేతుకమైన పత్రాలు దగ్గర ఉంచుకోవాని పేర్కొన్నారు. అటువంటి సమయంలో సహేతుకమైన కారణం బహిర్గతం చెయ్యకపోతే, ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకోవచ్చునని తెలిపారు. చట్టపరమైన నిబంధనలు, ఆదాయపు పన్ను చట్టాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలోనే పని చేస్తారని చెప్పారు. కమిషన్ ఇచ్చిన నిబంధనల మేరకు పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తితే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో మాస్టర్ ట్రైనర్లు సిహెచ్. భరద్వాజ శ్రీనివాస్, ఎ.నాగేశ్వర రావు, ఎ.ఉషశ్రీ, రుడా ప్రాజెక్ట్ అధికారి జి.కోటయ్య పాల్గొన్నారు.

పెద్దేవంలో గడపగడపకూ..

ప్రజాశక్తి-తాళ్లపూడి



పాల్గొన్న ఎంఎల్ఎ వెంకట్రావు, శ్రీనివాస్

జగనన్న ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనీ కొవ్వూరు నియోజకవర్గం వైసిపి ఇన్చార్జ్, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాళ్లపూడి మండలంలో పెద్దేవం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైసిపి జిల్లా నాయకులు, గ్రామ ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఇంటి వద్ద నాయకుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంఎల్ఎ వెంకట్రావుతోపాటు వైసిపి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, కాకర్ల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిసి కొలిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



మీరు ఎగ్గొట్టినా.. బడా నేతల జాబితాలోకి రారులెండీ..!!

విద్యార్థికి దాతల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోపాలపురం



పాల్గొన్న ఎంఎల్ఎ వెంకట్రావు, శ్రీనివాస్

అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన అజిత్‌కు ఉపాధ్యాయులు, దాతల నుంచి విరాళాలు సేకరించి అందించడం అభినందనీయమని ఎంఇఒ జి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం దొండపూడికి చెందిన విద్యార్థి గున్నూరి అజిత్ తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతుండగా ఆస్పత్రిలో వైద్యం చేయించి ప్రస్తుతం ఇంటి వద్ద వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మెరుగైన వైద్యం అందించడానికి నిరుపేదలు కావడంతో దాతల నుండి ఆర్థిక సహాయం అభ్యర్థించారు. పలు సంస్థలు, ఉపాధ్యాయుల నుంచి విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తం రూ.1.55 లక్షల నగదును ఎంఇఒ జి.శ్రీనివాసరావు, సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపిటిసి మారాజు రాజేష్ అజిత్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ సంపూర్ణ విజయ, హెచ్ఎం భైరవ స్వామి, ఉపాధ్యాయులు నూతంగి శ్రీనివాస్, యుగంధర్, సిఆర్‌పిలు కొయ్య నాగరాజు, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జెండా సభతో దద్దరిల్లిన తాడేపల్లి ప్యాలెస్

ప్రజాశక్తి-నల్లజర్ల



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి

తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే బ్లూ ప్రింట్ టిడిపి దగ్గర ఉందన్నారు. ప్రజల సొమ్ము దోచుకోకుండా, సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలిపారు. సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం, పాలన ద్వారా సంపాదించిన సొమ్మును పేదలకు అందజేస్తామని తెలిపారు. జగన్ రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి నెట్టారని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు చేతులు కలపాలని అన్నారు. టిడిపి జనసేన చేతులు కలిపింది తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదన్నారు. అధికారం కోసం అంతకన్నా కాదన్నారు. ఐదు కోట్ల రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం, చేతులు కలిపామని తెలిపారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏర్పడిన కూటమి అన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మలపూడి ప్రసాద్, ఖండపు వెంకటరత్నం, శ్రీనివాసరావు, యద్దనపూడి బ్రహ్మ రాజు, జమ్ముల సతీష్, పసుమర్తి సతీష్ పాల్గొన్నారు.

24వ వార్డులో ఎంపీ భరత్ పర్యటన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్రంలో సంక్షేమం, అభివద్ధి నిరంతరం జరగాలంటే అది ఒక్క జగన్మోహన్ రెడ్డి వల్లే సాధ్యమని రాజమండ్రి ఎంపీ, సిటీ నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. గురువారం నగరంలోని 24వ వార్డు మసీదు ఎదురుగా చాకలి సందు వద్ద నుంచి ఎంపీ భరత్ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఏగా గెలిపించాలని అభ్యర్థించారు. రాజమండ్రిని అన్ని రకాలుగా అభివద్ధి చేశానని చెప్పారు. పేదల సంక్షేమం కోసం తపించే వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. మనసున్న మంచి మనిషి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మళ్లా రావాలని, అందుకు మీ అందరి ఆశీస్సులు, మద్దతు పరిపూర్ణంగా ఇవ్వాలని ఎంపీ భరత్ అభ్యర్థించారు. అరవ సురేష్ కుమార్, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ కుమార్, యజ్జవరపు మరిడియ్య, యజ్జవరపు శ్రీనివాస్, కటకం చిన్నా, మద్దు సతీష్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

భవన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు, కుంద్రపు రాంబాబు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందే ప్రభుత్వ ఆర్థిక సాయం మంజూరు కావడం లేదని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారుగా రూ.ఐదు కోట్ల క్లెయిమ్స్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల రూ.కోట్లాది నిధులను సంక్షేమ పథకాలకు మళ్లిస్తూ కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు పోరాట ఫలితంగా ఏర్పడిన సంక్షేమ బోర్డును ఆనాటి ముఖ్యమంతి వైయస్ రాజశేఖర్ రెడ్డి సరిగ్గా అమలు చేశారని, నేటి ముఖ్యమంత్రి బోర్డుకు తూట్లు పొడిచారని చెప్పారు. నిర్మాణరంగంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను కార్మికులకు ఖర్చు చేయాలని, ప్రభుత్వం వాడుకున్న రూ.కోట్లాది నిధులు తిరిగి సంక్షేమ బోర్డుకు చెల్లించాలని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.కొండలరావు, సప్పా రమణ, కె.శ్రీనువాస్, చింతలపూడి సునీల్, నల్లా రామారావు, టి.నాగేశ్వరావు, ఎం.సాగర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి – ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన వీరమల్ల పద్మావతికి రెండేళ్ల క్రితం తాళ్ళపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన వీరమల్ల మహేష్ నాయుడుతో వివాహమైంది. అప్పట్లో కట్న కానుకలు, ఇతర లాంచనాలు ఇచ్చి ఆమెను పుట్టింటి వారు కాపురానికి పంపించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కాలంలో మహేష్ చెడు వ్యసనాలకి బానిసై భార్య పద్మావతిని అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారు. వేధింపులు తాళలేక ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కారు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి – అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. పలువురికి గాయాలయ్యాయి. వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలు, తోపుడుబండ్లను ఢీకొట్టింది. దీంతో ప్రజలు పరుగులు తీశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అమలాపురం తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని అచ్చియ్యపాలెం శివార్లలో సీతానగరం ఎస్ఐ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 70 లీటర్ల నాటు సారా, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, బట్టీ నిర్వాహకులు ఎవరనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అనుమానంతో భార్య హత్య

ప్రజాశక్తి – కాకినాడ

అనుమానం పెనుభూతమై భార్యను కత్తితో నరికి హత్య చేసిన ఘటన స్థానిక జగన్నాధపురంలో గురువారం చోటు చేసుకుంది. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు జగన్నాధపురం పప్పుల మిల్లు ఏరియాలో బొంతాల నూకరాజు, తన భార్య దివ్య ఇద్దరు పిల్లలతో కలిసి కాపురముంటున్నాడు. నూకరాజు బిల్డింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కాలంలో భార్య దివ్యపై నూకరాజు అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయమై గురువారం ఉదయం నూకరాజు, దివ్యల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో నూకరాజు ఆగ్రహంతో ఇంట్లో వాషింగ్ మిషన్ పక్కన ఉన్న కత్తిని తీసుకుని ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్ర గాయాలైన దివ్య భయాందోళనతో బయటకు పరిగెడుతూ వచ్చి గేటు వద్ద కుప్పకూలి పోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి సిఐ సురేష్ బాబు పరిశీలించారు. నూకరాజును అదుపులోకి తీసుకున్నారు.

పరివర్తనా కేంద్రాలుగా జైళ్లు

సామాజిక విశ్లేషకుడు మలసాని శ్రీనివాస్


ఖైదీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

గతంలో జైళ్లు కఠిన శిక్షలకు కేంద్రాలుగా ఉండేవని, ప్రస్తుతం అవి పరివర్తనా కేంద్రాలుగా మారాయని ప్రముఖ సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్ అన్నారు. సెంట్రల్ జైలులో జైలు సూపరింటెండెంట్, ఎస్.రాహుల్ ఆధ్వర్యంలో గురువారం ఖైదీలకు సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మలసాని మాట్లాడారు. ఖైదీలకు మానసిక శిక్షణ కార్యక్రమాన్ని ఇచ్చారు. మానవ విలువలు పెరిగిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా జైళ్ల పరివర్తన కేంద్రాలుగా మారాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన ఎన్నో అద్భుత గ్రంథాలు చాలా మంది జైళ్లో ఉండి రాసినవే అని ఆయన అన్నారు. ఖైదీలు జైల్లో చదువుకుంటూ, గ్రంథాలయాలను వినియోగించుకుంటూ, జైల్లో ఇచ్చే పలు రకాల శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ విడుదల అయిన తర్వాత మంచి పౌరులుగా, సమాజ మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు పలువురు మానసిక ఖైదీలకు వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇచ్చారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జైలులో ఖైదీల కోసం నిర్వహిస్తున్న పలు రకాల శిక్షణల గురించి వివరించారు. అనంతరం ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జైలు వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు, జైలు ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

భవన కార్మికుల పథకాలు అమలు చేయాలి


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి–కొవ్వూరు రూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సమర్థవంతంగా నిర్వహించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య డిమాండ్ చేశారు. గురువారం బస్టాండ్ సెంటర్ యూనియన్ కార్యాలయం వద్ద రెండో రోజు దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడంలో, సంక్షేమ బోర్డును సమర్ధవంతంగా నిర్వహించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారని చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డు ద్వారా రాష్ట్రంలో 10 సంవత్సరాలపాటు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిగాయన్నారు. సిఎం జగన్ ప్రభుత్వం సంక్షేమానికి తూట్లు పొడిచిందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు అందకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. మరో వైపు కరోనా కాలం నుంచి నేటి వరకు భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించడంలో కార్మికులకి ఆపద సమయంలో ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. సిపిసి సభ్యులు గెడ్డం సాయిబాబు, బొనిగే రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వెంకట నాగభూషణం, జనసేన పార్టీ సీనియర్ నాయకులు మారిశెట్టి వెంకటేశ్వరరావులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. రెండో రోజు దీక్షలో జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు, రంబాల సత్యనారాయణ, దేవ సత్యనారాయణ, వాజ శ్రీనివాస్, తిరుమల్ల సూరిబాబు, శివకోటి రవికుమార్, వసువులేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఉప్పే కేదర్, దుళ్ల సత్తిబాబు, సిద్ధంశెట్టి సత్యనారాయణ, మైగాపుల నాగేశ్వరరావు, జొన్నల రాంబాబు, మాణిక్ రెడ్డి హరిబాబు, మస్కపల్లి శ్రీను కార్మికులకు మద్దతుగా దీక్షా శిబిరంలో పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి

ప్రజాశక్తి–గోపాలపురం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారు హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కొత్తట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు (30) తాడేపల్లిగూడెం టిడిపి, జనసేన మహాసభకు వెళ్లి అక్కడి నుండి కొయ్యలగూడెం తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. తిరిగి బైకుపై ఇంటికి వెళుతుండగా గోపాలపురం గ్రామ శివారు ఎన్‌హెచ్ రోడ్డులో హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టి ఆపకుండా వెళ్ళిపోయినట్లు తెలిపారు. తల వెనుక తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మతుడి తండ్రి ఏనుగు చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పాఠశాల గోడను ప్రారంభిస్తున్న మంత్రి వేణు, తదితరులు

పల్ల వెంకన్న ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి– కడియం

పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియపులంకలో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ స్వీయ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రక్షణ గోడను మంత్రి వేణు, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీరంగంలోనూ రాజకీయాలోనూ రాణిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు విస్తరించారన్నారు. ఆయన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. మార్గాని సత్యనారాయణ, తిరుమల శెట్టి శ్రీనివాస్, ఊటుకూరి శైలజ, తాడాల చక్రవర్తి, బోడపాటి సత్యనారాయణ, పల్ల వెంకన్న చారటీబుల్ ట్రస్ట్ సభ్యులు పాట శెట్టి శ్రీనివాస్ చక్రవర్తి, పల్ల వెంకటేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీ సాయి జ్యూయలర్స్ ప్రారంభం

ప్రజాశక్తి–గోకవరం

గోకవరంలోని సుదీర్ఘ విద్యా అనుభవం కలిగిన రాజా పబ్లిక్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ సాయి శారీస్ అండ్ జ్యుయలర్స్ షాపును బుధవారం గోకవరం ఎస్ఐ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన వసంత కుమార్ అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారని, ఆయన వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజా పబ్లిక్ స్కూల్ చైర్మన్ పి.సూర్యప్రకాశరావు, ప్రిన్సిపల్ నాగలక్ష్మి మాట్లాడుతూ సరికొత్త డిజైన్లలో అన్ని రకాల వారికీ అందుబాటులో ఉండే ధరలతో తమ షాపులో లభిస్తాయన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండలానికి చెందిన అధికారులు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి–చాగల్లు

చాగల్లు శ్రీ వెలగపూడి రామకష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 268 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ పావని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేసినట్టు పావని తెలిపారు.

చాగల్లులో అన్నదానం

ప్రజాశక్తి–చాగల్లు

చాగల్లు గ్రామంలోని శివాలయ వీధిలో శ్రీ సద్గురు సాయినాథ్ 22 వార్షికోత్సవం సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. చుట్టు పక్కట ప్రాంతాల నుంచి అధిఖ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నట్టు నిర్వాహకులు లింగాల శ్రీనివాస్ తెలిపారు.

యానాం వార్తలు



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అశోక్

బాలికలను రక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి – యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా 450 మంది ఆడపిల్లలతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆడపిల్లలను రక్షించాలని, వారిని చదివించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఎడిపిసి కమిడి ప్రభాకర్, పాము సత్యనారాయణ, సిఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగన్, నూకరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు



పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్

ప్రజాశక్తి – యానాం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. జాతీయంగా, స్థానికంగా ఉన్న సమస్యలపై యువత ఆలోచన విధానం, పరిష్కరించుకునే విధానం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, అధ్యాపకులు చెల్లి నరేష్, తిరికోటి సుబ్బలక్ష్మి, కళాశాల సిబ్బంది, వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి – పెద్దాపురం, ఏలేశ్వరం

ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్య లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు ఏలేశ్వరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్‌రాజు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో మంజూరు కావడం లేదని, బకాయిలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని తెలిపారు. తక్షణమే ఆర్థిక పరమైన అంశాలను పరిష్కరించాలని, అలాగే ఉపాధ్యాయుల నియామ కంలో ప్రవేశపెట్టిన అప్రెంటిస్ విధానం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విటియ ఆచార్యులు, పి సత్తిబాబు, ఎన్ఎల్ఎన్.రాజు, పిఎస్.వాణి, ఆర్ఎస్.రాజు, కె.సత్యవతి, ఆర్ కుమారి, ఎ.లలిత పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం తహశీల్దార్ కార్యాల యం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యంతర పిఆర్‌సి కింద 30 శాతం చెల్లించాలని, ఒపిఎస్ విధానం కొనసాగించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.సత్యప్రసాద్, డి.ఎ.రాజశేఖర్, శ్రీరామ్, ఎ.సురేష్, కెసి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు ప్రత్యేక స్థానం


ప్రజాశక్తి –దేవరపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గుండెల్లో వాలంటీర్లకు ప్రత్యేక స్థానం ఉందని.. ఇక అంతకు మించిన అవార్డులు, రివార్డు ఏముందని హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. వాలంటీర్లకు అవార్డులు, రివార్డులు అనేవి వారి ప్రతిభ, పనితీరు ఆధారంగా వస్తాయన్నారు. వాలంటీర్లు జీతం కోసం పనిచేసే ఉద్యోగులు కాదని.. గౌరవ వేతనం తీసుకుంటూ ప్రజా సేవ చేస్తున్నారని తెలిపారు. గురువారం దేవరపల్లిలో ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలోఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రధానం మండలస్థాయి కార్యక్రమంలో 310 మంది వాలంటీర్లకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం మంత్రి వనిత మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ సువర్ణయుగం నెలకొల్పారన్నారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో, గ్రామ, వార్డు సచివాలయాలకు, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించిన వాలంటీర్లకు అవార్డులను అందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వంలోని సంక్షేమం, అభివద్ధి, అందించిన సేవలకు.. జగనన్న ప్రభుత్వంలోని సంక్షేమం, అభివృద్ధి, అందిస్తున్న సేవలకు మధ్య తేడాలను ప్రజలకు వివరించాలని కోరారు.



దేవరపల్లిలో..

చాగల్లు దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ సువర్ణయుగం నెలకొల్పారని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. వాలంటీర్లు జీతం కోసం పని చేసే ఉద్యోగులు కాదని.. గౌరవ వేతనం తీసుకుంటూ ప్రజా సేవ చేస్తున్నారని తెలిపారు. నెలటూరులో గురువారం ఉత్తమ వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ఆయన ప్రదానం చేశారు. మండలంలోని 256 మంది వాలంటీర్లకు ఆవార్డులు ప్రదానం చేసి వారిని పేరు పేరునా పలకరించారు.అవినీతి, వివక్షకు తావు లేకుండా సేవలందిస్తున్న వాలంటీర్ల సేవలను గుర్తించి వారికి ప్రోత్సాహకంగా అవార్డులను అందిస్తుననట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ఆశయ సాధనకు వాలంటీర్లు చేస్తున్న సేవలు ఎంతో గొప్పవన్నారు. వరుసగా ఈ ఏడాది కూడా వాలంటీర్లకు వందనం పేరుతో ఉత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రధానం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అందజేయాలన్నారు. అవినీతి, వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో, గ్రామ, వార్డు సచివాలయాలకు, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించిన వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను అందిస్తున్నట్టు చెప్పారు. వాలంటీర్లు మరింత బాధ్యతగా ప్రజలకు సేవలందించాలని హోమ్ మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.బుజ్జి, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


చాగల్లులో..

తాళ్లపూడి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని ఆ పార్టీ కొవ్వూరు కొవ్వూరు నియోజకవర్గ ఇన్చార్జి, గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడిలోని సొలస సత్యనారాయణ దమయంతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వైసిపి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు సమృద్ధిగా అందాయన్నారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అయ్యేలా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించవలసిన ఆవశ్యకత వాలంటీర్లపై ఉందన్నారు. మండలంలో 210 మంది వాలంటీర్లు ఉండగా ఇద్దరికి సేవా వజ్ర, మరో ఐదుగురికి సేవా రత్న అవార్డులను అందజేశారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


తాళ్లపూడిలో..

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

గోపాలపురం : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 600 మంది, రెండో సంవత్సరం 400 మంది మొత్తం 1000 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వాల్సి ఉందని సిఎస్ టి.ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి 18 వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 20 గదులను ఏర్పాటు చేసి వాటిలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు ఈ పరీక్షల నిర్వహణ కోసం డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా సివివి.సాంబశివరావు, వై.రత్నరాజు వ్యవహరిస్తారన్నారు. శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 495 మంది పరీక్షలు రాయాల్సి ఉందని చెప్పారు. మొదటి రోజు పరీక్షకు 395 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. పరీక్షల నిర్వహణకు 13 గదులను ఏర్పాటు చేశామని, ఒక్కొక్క గదిలో 30 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉందని సిఎస్ సివి.రమణ, డిపార్ట్మెంట్ ఆఫీసర్ కె.దుర్గారావు తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

కాకినాడ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదా యకమని జెసి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురు వారం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమా దాలు సంభవించే సమయాల్లో తీసుకో వలసిన రక్షణ చర్యలపై ఒఎన్‌జిసి సహకా రంతో సచివాలయ ఉద్యోగులు, రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వాలంటీర్స్‌కు శిక్షణా కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకో వాలనే దక్పదాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చు కోవాలని సూచించారు. జీవన గమనంలో సేవ అన్నది ఒక అలవాటుగా మార్చుకో వాలన్నారు. ప్రధానంగా రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు.

జ్యోతుల నెహ్రూపై విమర్శలకు ఖండన

ప్రజాశక్తి – జగ్గంపేట

టిడిపి రాష్ట్ర ఉపాధ్య క్షులు జ్యోతుల నెహ్రూను విమర్శి స్తే పరిణామాలు తీవ్రంగా ఉంటా యని సూర్యచంద్రను టిడిపి నాయకులు హెచ్చరించారు. గురువారం జగ్గంపేట టిడిపి కార్యాలయంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ సూర్య చంద్ర గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో నెహ్రూ ను దూషిస్తూ చేసిన వ్యాఖ్యలను ఆయన సోదరుడు పాఠంశెట్టి బాబ్జి తీవ్రంగా ఖండించారు. ఎన్ఆర్ఐ ఫండ్స్‌ను సూర్యచంద్ర తినేశారంంటూ వస్తున్న వీడియోలు వైరల్ అవ్వడంతో మనస్తాపం చెందినట్లు తెలిపారు. ఆమరణ నిరాహార దీక్ష విరమించి నెహ్రూను సపోర్ట్ చేయాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు మాట్లాడుతూ నెహ్రూ 40 ఏళ్ల రాజకీయంలో ఎంతో మందిని తయారు చేశారన్నారు అటువంటి వ్యక్తిని దూషించడం ఎంతవరకు సబబు అని సూర్యచంద్రను ప్రశ్నించారు. నెహ్రూ ద్వారానే రాజకీయాలకు వచ్చి ఆయన్ని దూషించడం సరి కాదన్నారు. పొత్తులో భాగంగా సీట్లు రాకపోవడం అనేది సహజమేనని చెప్పారు.



అంజిబాబు మృతి తీరని లోటు

ప్రజాశక్తి–గోపాలపురం

రోడ్డు ప్రమాదంలో జనసేన సైనికుడు మరణించడం పార్టీకి తీరని లోటు అని గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. బుధవారం రాత్రి గోపాలపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసైనికుని కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఓదార్చారు. గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహానికి నివాళి అర్పించారు. రమలీల, సుధీర్ కుమార్, శ్యామ్, సురేష్ నివాళి అర్పించారు.